క్లుప్తంగా

ముగిసిన గౌరీశంకరుల మహోత్సవాలు

కొత్తపల్లి: గ్రామంలో నిర్వహిస్తున్న గౌరీ శంకరుల మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్థానిక బీటు వీధిలో నెల రోజుల పాటు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గౌరీదేవి, నందీశ్వరుని ఊరేగింపు నిమజ్జనం చేశారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



కొత్తపల్లిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: గ్రామాల్లోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సదర్భంగా సీపీఎం మండల నాయకుడు గుర్రాల అప్పారెడ్డి మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 8వ తేదీ నుంచి 18 వరకూ గ్రామాల్లో పర్యటించామన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నియంత్రించాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, వాకతిప్పలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, సోమరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కుంతీమాధవ స్వామికి విశేష అభిషేకాలు



కుంతీమాధవ స్వామివారికి చందనాభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం: కార్తిక మాసం సందర్భంగా గత రెండు రోజులుగా పిఠాపురంలో కుంతీమాధవ స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

సామర్లకోట: పట్టణంలోని పసువులమ్మ ఆలయం వద్ద ఉన్న శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలని జిల్లా మానవ హక్కుల సంఘ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కోటపేట, సీతారామ కాలనీ, పెన్షన్ లైన్, కర్లమాలపల్లి, రెల్లిపేట నుంచి మృతదేహాలను ఈ శ్మశాన వాటికలో ఖననం చేస్తారని చెప్పారు. ఈ శ్మశాన వాటిక ప్రదేశం కొబ్బరి బొండాలు, చెత్తా చెదారంతో నిండిపోవడం వలన శ్మశాన వాటికలోకి వెళ్లడానికి మార్గం లేదని సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, జుత్తుక అప్పారావు, కుంచే నానిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ దీనిని పరిశీలించి, శ్మశాన వాటిక రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

పిఠాపురం: స్థానిక రైస్ మిల్లర్ల అసోసియేషన్ కల్యాణ మండపంలో సోమవారం పిఠాపురం, తుని ఏరియా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా గొల్లపల్లి తిరుపతిరావు (బాబి), ఉపాధ్యక్షుడిగా గుండుబల్లి పోలీస్ (చిన్న), సెక్రటరీగా శెట్టి శ్రీనివాస్, ట్రెజరర్‌గా మేడిపూడి రాజబాబు, జాయింట్ సెక్రటరీగా కీర్తి సూరిబాబు, సంఘ గౌరవాధ్యక్షుడిగా రెడ్డి రాజా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రెటరీ మొగలి అప్పారావు (నాని), ఉపాధ్యక్షుడు పేకేటి నాగేశ్వరరావు, కొయ్య మురళి, కనిగిరి దివాణం, వెలుగుల బాబి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా.. రైతుకు ధీమా

- జీడిమామిడి తోటలకు బీమా సాకర్యం
- ఈ నెల 22 వరకూ ప్రీమియం చెల్లించేందుకు అవకాశం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారులు



జీడిమామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి సత్యశైలజ



పిఠాపురం నియోజకవర్గంలో జీడిమామిడి తోట

పిఠాపురం: బీమా ప్రీమియం చెల్లించండి.. ధీమాగా ఉండండి అంటూ ఉద్యాన అధికారులు జీడిమామిడి రైతులకు సూచిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లోని జీడిమామిడి తోటలకు పునర్ వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో 2024–25 సంవత్సరానికి బీమా చేయించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉండడంతో బీమా, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బీమా వర్తిస్తుంది ఇలా..

బీమా చేయించుకున్న పంటలకు అధిక వర్షం, అధిక ఉష్ణోగ్రతలు, ఈదురు గాలులు, సాపేక్ష తేమ, ప్రతికూల వాతావరణం నేపథ్యంలో పంటలు దెబ్బతింటే బీమా వర్తిస్తుంది. బీమా చేయించుకున్న రైతులు తమ పంటలు ఏ కారణం చేతనైనా దెబ్బ తింటే సంబంధిత ఉద్యాన శాఖాధికారులకు సమాచారం ఇస్తే వారు వచ్చి పంటలు పరిశీలించి బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇస్తారు. కంపెనీ సిబ్బంది వచ్చి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు.

రైతుల అభీష్టం మేరకు...

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల బీమా పథకాన్ని అందరికీ వారి అవసరాల మేరకు ఐచ్ఛికంగా వర్తింపజేస్తారు. రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణం తీసుకుంటే రుణం పొందిన సందర్భంలో సంబంధిత బ్యాంకు అధికారులు బీమా ప్రీమియాన్ని రుణ ఖాతా ద్వారా వసూలు చేసి బీమా కంపెనీలకు చెల్లించే ఏర్పాట్లు ఉన్నాయి. అలా తమకు బీమా వద్దు అనుకున్న రైతులు తమకు బీమా వద్దని ప్రీమియం వసూలు నిలిపి వేయమని బ్యాంకుకు తెలియజేయాలి. పంట నష్టం సంభవిస్తే వచ్చే నష్ట పరిహారం నేరుగా రైతు బ్యాంకు రుణ ఖాతాకు జమవుతుంది. బ్యాంకు ద్వారా రుణం తీసుకోని రైతులు తమ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ సీఎస్‌సీ, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, పీఏసీఎస్‌లో, పోస్టాఫీసులో తమ ఆధార్ కార్డు భూమి, కౌలు ధ్రువపత్రాలు, పంట వేసిన ధ్రువపత్రం, బ్యాంకు వివరాలతో ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు. నేషనల్ క్రాప్ ఇన్సురెన్స్ పోర్టల్ ద్వారా నేరుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లించవచ్చు. మొబైల్ యాప్ ద్వారా కూడా ప్రీమియం చెల్లించవచ్చు. రుణం తీసుకోని రైతులకు బీమా వస్తే సంబంధిత సొమ్మును ప్రీమియం చెల్లించినప్పుడు సూచించిన బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.

297 హెక్టార్లలో సాగు

పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 297 హెక్టార్లలో జీడిమామిడి సాగవుతోంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు రోజుకో రకంగా ఉంటుండడంతో జీడిమామిడి రైతులు బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవడం ద్వారా నష్టాలను నివారించుకోవచ్చు. పంటల బీమా పథకంలో ప్రస్తుతం జీడిమామిడి పంటలకు బీమా వర్తింప చేస్తున్నందున అందరు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లోని జీడిమామిడి రైతులతో సమావేశాలు నిర్వహించి బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వెంటనే తమ సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలు తెలుసుకుని పంటకు బీమా సౌకర్యం పొందాలి. హెక్టారుకు బీమా మొత్తం రూ.75 వేలు కాగా దానిలో 5 శాతం రూ. 1500 రైతు ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకూ జీడి మామిడి పంటలకు నష్టం వాటిల్లితే ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందజేస్తారు. పంటలకు ఏ విధమైన నష్టం వాటిల్లకపోతే ప్రీమియం సొమ్ము వెనక్కి ఇవ్వరు.

– కె.సత్య శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

బాధితుడికి వంగా గీత పరామర్శ



ఉప్పాడలో బాలును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ ఎంపీటీసీ చొక్కా సింగన్న కుమారుడు బాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత సోమవారం బాలును పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

సామర్లకోట: కార్తిక మాసం సందర్భంగా స్థానిక ఇస్మాయిల్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వన సమారాధన ఉత్సాహంగా సాగింది. తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. పిల్లలు, పెద్దలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ఆర్డీఓ శ్రీరమణి



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 13 అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరిందేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్న ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం స్పందనకు 13 ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, డీవైఈఓ శర్మ, చప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెద్దాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లూథరన్, జేఎన్, బాలికోన్నత, సాగర్, వీర్రాజు హైస్కూల్ విద్యార్థులతో పాటు, మహారాణి కళాశాల విద్యార్థులు ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, పోటీల విజేతలకు 20వ తేదీన బహుమతీ ప్రదానం ఉంటుందన్నారు. ఈ పోటీలను హెచ్ఎంలు కే.శ్రీదేవి, ఎంఎల్ శివజ్యోతి పర్యవేక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం లైబ్రేరియన్ నళీనీప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పాడలో వ్యాస రచన పోటీలకు హాజరైన విద్యార్థులు

సామర్లకోట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఏర్పాటు చేసిన పోటీలను గ్రంథాలయాధికారి బందిల రత్నమణి ప్రారంభించారు. గ్రామీణ వాతావరణం, పర్యావరణ పరిరక్షణపై ఆయా విభాగాలకు పోటీలు నిర్వహించారు. మంగళవారం వక్తృత్వ పోటీలు ఉంటాయని చెప్పారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దాపురం: జట్టు లేబర్ హమాలీ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పామాయిల్ తోటలో సోమవారం జట్టు లేబర్ యూనియన్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ, నిత్యం బరువులు మోసే హమాలీ కూలీల బతుకులకు భరోసా కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఏకా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా నారపాటి వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా కన్నూరి వీర వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా సర్వసుద్ధి వీరబాబు, కోశాధికారిగా రాయుడు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుట్ట త్రిమూర్తులు, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూరిత వాతావరణానికి ఆటల పోటీలు



ఆటల పోటీలకు హాజరైన వివిధ పరిశ్రమల ఉద్యోగులు

సామర్లకోట: పెద్దాపురం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియాలో ఉన్న పారిశ్రామిక సంస్థల మధ్య స్నేహపూరిత వాతావరణం పెంపొందడానికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్, దేవి సీఫుడ్స్ లిమిటెడ్, శ్రీగిరిజ అల్లోయ్ అండ్ పవర్ ఇండియా లిమిటెడ్, నెక్కంటి సీఫుడ్స్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏలైట్ ఇన్స్ట్రుమెంట్స్, అపెక్స్ ప్రోజెస్ ఫుడ్ లిమిటెడ్ సంస్థలు కలిసి ఆటల పోటీలు ఏర్పాటు చేయడానికి సోమవారం ముందుకొచ్చాయి. దీనివల్ల పరిశ్రమల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం, ఉద్యోగులకు మంచి ప్రోత్సాహం అందించడానికి అవకాశాలు ఉంటాయని ప్రతినిధులు తెలిపారు. పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, చెస్ పోటీలు ఈ నెల 21 వరకు జరుగుతాయని రాక్ సిరామిక్స్ ప్రతినిధి టి.నీరజ్‌కుమార్ తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను పెద్దాపురం మున్సిపల్ ఇండోర్ షటిల్ కోర్టులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆటల పోటీల్లో ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ వీవీవీ శేషగిరిరావు, వినోద్, చెల్లదురై పి. బాలాజీ, వీజీఎస్ కుమార్, రవీంద్రనాథ్, అనిల్, హెచ్ఆర్ శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, రవి, సురేష్, ఎస్ఎస్ రావు, గోపిచంద్, అచ్చుత్, గాంధీ, మణికంఠ, రవీంద్ర, లక్ష్మణ్, కృష్ణ, గిరిధర్ పాల్గొన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో తెప్పోత్సవం



కోనేరులో తెప్పోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు

సామర్లకోట: కార్తిక మాసం స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పంచారామ క్షేత్రంలో తెప్పోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. గత పదేళ్లుగా తెప్పోత్సవం దాతల సహకారంతో జరుగుతుంది. ఈ ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో తెప్పోత్సవం జరుగుతుందని ఈఓ తెలిపారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలుంటాయి. ఆలయ కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. పంటును హంస వాహనంగా తీర్చిదిద్దుతున్నారు. దీనిని విద్యుద్దీపాలు, పూలతో అలంకరించి, స్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి, కోనేరులో మూడు పర్యాయాలు తిప్పుతారు. ముందుగా కోనేరు వద్ద ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తారు. హంస వాహనంపై ఎనిమిది మందికి మాత్రమే అనుమతి ఉంటుందని ఈఓ తెలిపారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు.

ప్రజా ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

పిఠాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం పిఠాపురం రథాలు పేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో జరిగింది. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, మూడు మండలాల ఎమ్మార్వోలు ,ఎంపీడీవోలు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలకు త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు తదితర అంశాలకు చెందిన 78 అర్జీలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శివోహం..!

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు



పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు విడిచిపెడుతున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాదగయలో కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న పురోహితులు



పంచారామ క్షేత్రంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఉప్పాడలో దీపాల అలంకరణలో స్వామి

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో నియోజకవర్గంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి లక్ష పత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా కార్తిక మాసం ప్రారంభం నుంచి స్వామివారి ఆలయాన్ని రోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి ఆలయాల్లో అధికారులు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

కుక్కుటేశ్వరస్వామికి విశేష పూజలు

కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో

పిఠాపురం మండలం భోగాపురం, పి.దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని ఆలయాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులతో తెల్లవారుజాము నుంచి కిటకిటలాడాయి. పండితులు ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లిలోని రాజశేఖరస్వామి, ఉప్పాడలో మత్స్యలింగేశ్వరస్వామి, చొడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, భ్రమరాంబ సమేత వీరమల్లేశ్వరస్వామి, గోర్స, యండపల్లి, నాగులాపల్లి గ్రామాల్లోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: కార్తిక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని సాయంత్రం కుమారారామ భీమేశ్వరస్వామిని, అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

పోటెత్తిన భక్తులు

కార్తిక మాసం మూడో సోమవారం కావడంతో పంచారామ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఉచిత, రూ.20, రూ.50, రూ.100 క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారికి తొలి అభిషేకం, తొలి పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. కాల భైరవ స్వామి ఆలయం, ధ్వజ స్తంభం, రావి, జమ్మి చెట్లు, తులసి మొక్కల వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని శివలింగానికి నీటితోను, పాలతోను అభిషేకాలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం స్వీకరించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు చల్లా సత్తిబాబు, మలిరెడ్డి శ్రీను భక్తులకు సేవలందించారు. స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత వేణుగోపాలస్వామి, చొడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, పాత సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయాలకు భక్తులు భారీగా దర్శించుకున్నారు.

అర్బన్, రూరల్ ప్రాంతాల్లో..

పెద్దాపురం: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ, వివిధ గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాలు, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని గుడివాడ, చదలాడ, సిరివాడ, గోరింట, తాటిపర్తి తదితర గ్రామాల్లో భారీ వన సమారాధనలు జరిగాయి.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చనలు భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసిన వారికి దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.